అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ
- పలు గ్రామాల్లో 'ప్రజా పాలన'కు హాజరు

రేపాకలో ప్రజాపాలన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట, జనవరి 6 : అభివృద్ధే ధ్యేయంగా అందరూ పని చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని రేపాక, సోమారంపేట, వెంకట్రావుపల్లి, అనంతగిరి గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల హామీలు అమలు చేయడానికి చిత్తశుద్ధితో ఉందన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ పథకం అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నదన్నారు. అనంతరం ఆరు గ్యారెంటీలపై అవగాహన కల్పించారు. రేపాకలో గౌడ సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, సర్పంచులు రోండ్ల లక్ష్మి, కాచారం శ్రీనివాస్ రెడ్డి, మంద సుశీల, పల్లె నర్సింహా రెడ్డి, ఎంపీటీసీ సుమలత, తహసీల్దార్ జావిద్ అక్బర్, ఎంపీడీవో మీర్జాతోపాటు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తాం

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- ప్రజాపాలన సభలకు హాజరు


వేములవాడ: 27వ వార్డులో దరఖాస్తులు తీసుకుంటున్న విప్, ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్

వేములవాడ/సిరిసిల్ల రూరల్, జనవరి 6: అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తూనే.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన వేములవాడ పట్టణంలోని 27వ వార్డు, తంగళ్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమాలకు హాజరై, దరఖాస్తులు స్వీకరించారు. ఆరు గ్యారెంటీల కోసం ప్రజలందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు తంగళ్లపల్లి ప్రెస్ క్లబ్‌లో పాత్రికేయులతో సమావేశమై, తేనేటి విందు స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, కౌన్సిలర్ గోలి మహేష్, తంగళ్లపల్లి జడ్పీటీసీ మంజుల, సర్పంచ్ అనిత, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో లచ్చాలు పాల్గొన్నారు.

వ్యాపార, వాణిజ్య సంస్థల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

- ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్/చందుర్తి , జనవరి 6: జనసంచారం ఎక్కువగా ఉండే వ్యాపార, వాణిజ్య సంస్థల్లో ప్రజాభద్రత చర్యల్లో భాగంగా తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్‌లో భాగంగా వంద మందికి పైగా జనసంచారం ఉన్న ప్రదేశాల్లో భద్రతా చర్యలు పాటించాలని పేర్కొన్నారు. నేరాల పరిశోధనలో, అనుకోని సంఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయన్నారు. ఎంట్రీ, ఎగ్జిట్, పార్కింగ్ ప్ర దేశాల్లో సీసీ కెమెరాలను ఈనెల 27 లోపు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అనంతరం సీఐ స్థాయి అధికారి తనిఖీ చేసి యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఈనెల 10న బుధవారం చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ప్రజా దివస్ ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దమ్మన్నపేట వాసి

రామ్ విలాస్ పాశ్వాన్

గంభీరావుపేట, జనవరి 6: ఆల్ ఇండియా అగ్రికల్చర్ స్టూడెంట్ యూనియన్ జాతీయ అధ్యక్షుడిగా మండలంలోని దమ్మన్నపేటకు చెందిన రామ్ విలాస్ పాశ్వాన్ ఎన్నికయ్యాడు. (ఐసీఏఆర్) న్యూఢిల్లీ భారత వ్యవసాయ పరిశోధన విద్యాలయంలో విద్యార్థి రామ్ విలాస్ పాశ్వాన్ పరిశోధనలు చేస్తున్నాడు. స్టూడెంట్ యూనియన్ ఎన్నికలు నిర్వహించగా ఆయా రాష్ట్రాల నుంచి 304 మంది నామినేషన్ వేశారు. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో స్టూడెంట్ యూనియన్ జాతీయ అధ్యక్షుడిగా రామ్ విలాస్ పాశ్వాన్ ఎన్నికయ్యాడు.

నేడు డీసీఎంలో ఉచిత కంటి వైద్య శిబిరం

బోయినపల్లి, జనవరి 6 : మండలంలోని కొదురుపాక డీసీఎం కంటి దవాఖానలో ఆదివారం ఉచిత కంటి వైద్య శస్త్రచికిత్సల శిబిరం నిర్వహిస్తున్నట్లు దవాఖాన వ్యవస్థాపకులు డాక్టర్ వైరాగ్యం రాజలింగం, రిటా బహదుర్షా దంపతులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం కొదురుపాక కంటి దవాఖానలో కంటి ఆపరేషన్ అవసరం ఉన్న వారికి ఉచిత ఆపరేషన్ చేస్తున్నట్లు చెప్పారు. అర్హులందరూ కంటి ఆపరేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

8న జాతీయ అప్రెంటిస్ మేళా

సిరిసిల్ల రూరల్, జనవరి 6: తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 8న ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాలో హైదరాబాద్ వరుణ్‌మోటర్స్, సర్వో మేధతో పాటు ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. అవకాశాన్ని ఐటీఐ పూర్తి చేసిన వారందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఆయా నంబర్లలో (95056-74905, 8106794500) సంప్రదించాలని సూచించారు.

కళాకారులకు 250 గజాల స్థలం ఇవ్వాలి

వేములవాడ టౌన్, జనవరి 6: కళాకారులు తమ ఆటపాటలతో తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్నందున రాష్ట్ర ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని జేఏసీ కళాకారుల కమిటీ చైర్మన్ యెల్ల పోశెట్టి కోరారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులను కూడా పోరాట స్వాతంత్ర సమరయోధులుగా గుర్తించి జిల్లా కేంద్రంలో 250 గజాల స్థలం ఇవ్వాలన్నారు. నెలకు రూ.20 వేల గౌరవ వేతనం ఇచ్చి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇక్కడ బొడ్డు రాములు, సావన్నెపల్లి శ్రీనివాస్, వరాల దేవయ్య, హన్మండ్లు, తదితరులు ఉన్నారు.

కోర్టు కార్యాలయ భవనం ప్రారంభం

గాంధీచౌక్, జనవరి 6 : జిల్లా కోర్టు ఆవరణలో నిర్మించిన సిబ్బంది కార్యాలయ భవనాన్ని శనివారం జిల్లా ప్రధాన న్యాయయూర్తి ఎన్ ప్రేమలత ప్రారంభించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ, కార్యాలయం ఏర్పాటుతో న్యాయవాదులు, కక్షిదారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. త్వరలోనే సిరిసిల్ల రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇక్కడ సినియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, బార్‌అసోషియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్, అడ్మిని స్ట్రేటివ్ అధికారులు పద్మ, రమణారావు, న్యాయవాదులు ఉన్నారు.

రాజన్న సేవలో ప్రభుత్వ విప్

వేములవాడ టౌన్, జనవరి 6 : వేములవాడ రాజన్నను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్వామివారిని శనివారం దర్శించుకున్నారు. కోడె మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు నాగిరెడ్డి మండపంలో వేదోక్త ఆశీర్వచనం చేశారు. ఆలయ పర్యవేక్షకులు అల్లి శంకర్, ప్రొటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, గోలి శ్రీనివాస్ స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు అందజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రుద్రంగి, జనవరి 6: మండల కేంద్రంలోని పలువురు బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన గడ్డం రాజవ్వ, సుమంత్ కాంతవ్వ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను ఎంపీపీ గంగం స్వరూపారాణి, జడ్పీటీసీ గట్ల మీనయ్యలతో కలిసి ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇక్కడ నాయకులు గంగం మహేశ్, మాడిశెట్టి ఆనందం, కొడగంటి శ్యామ్, మహేశ్ ఉన్నారు.

ప్రకాశ్ గుప్తా సేవలు చిరస్మరణీయం

సిరిసిల్ల టౌన్, జనవరి 6: టెలికాం ఎంపాయీస్ యూనియన్ సీనియర్ నాయకుడు కామ్రేడ్ ఓం ప్రకాశ్ గుప్తా అందించిన సేవలు చిరస్మరణీయమని టెలికాం ఎంప్లాయీస్ యూనియర్ రాష్ట్ర నాయకుడు రామినేని ఫణిరాజారావు అన్నారు. శనివారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఓం ప్రకాశ్ గుప్తా 12వ వర్ధంతి వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ డీఈ పరకాల రమేశ్, ఎస్టీఈ జనార్దన్, తిరుమలి నరేశ్, సత్యానంద్, వెంకటేశ్వర్లు, రవి, లక్ష్మణ్, మోతీలాల్, వనజ ఉన్నారు.

చివరి రోజు 40,157

- ప్రజా పాలనకు మొత్తం 1,90,965 దరఖాస్తులు
- ముగిసిన కార్యక్రమం

చందుర్తి: ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

రాజన్న సిరిసిల్ల, జనవరి 6 (నమస్తే తెలంగాణ): గత నెల 28నుంచి ఈ నెల 6 వరకు జిల్లాలోని 255 గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాల్టీల్లోని 67వార్డుల్లో చేపట్టిన ప్రజాపాలన సదస్సులు శనివారంతో ముగిశాయి. మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహలక్ష్మీ, చేయూత పథకాల కోసం ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులకు ఉచితంగానే అప్లికేషన్ ఫారాలు పంపిణీ చేశారు. ప్రజాపాలన నోడల్ అధికారి శ్రీదేవసేన జిల్లాలో పర్యటించి, సదస్సుల నిర్వహణ తీరును పరిశీలించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు భీమ్యానాయక్, గౌతమి పూజారి, ఆర్డీవోలు, డీఆర్‌డీఏ, అధికారులతోపాటు జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళ, రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలందరూ సదస్సులను సందర్శించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జిల్లాలోని 13మండలాల్లో నిర్వహించిన సదస్సులకు హాజరయ్యారు. చివరి రోజు శనివారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని 27వ వార్డు, తంగళ్లపల్లి మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమాల్లో ఆది శ్రీనివాస్, ఇల్లంతకుంట మండలంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సదస్సులను అదనపు కలెక్టర్ గౌతమి పూజారి సందర్శించి, డేటా ఎంట్రీని పరిశీలించారు. డాటా ఎంట్రీలో పొరపాట్లు జరుగకుండా చూడాలని ఆపరేటర్లు, అధికారులకు సూచించారు. కాగా, చివరి రోజు 40,157 దరఖాస్తులు రాగా, మొత్తం 1,90,965 వచ్చినట్లు అధికారులు తెలిపారు. వచ్చిన అప్లికేషన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు వారు చెప్పారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★Residential Plot 2250 Sq. yards for Sale in Prime Residential Area at Near SRR College, Jagityal Road, Karimnagar Town. Ph: 9703544199.
NT-319319

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319407-All

LOST

★Neha W/o. Syed Maqsood Ahed H.No. 6-5-73, Vidyanagar, Sircilla Town, Rajanna Sircilla Dist. T.S. My possport No. K3613777 Lost Traveling Vidyanagar to Busstand by Auto any one find call me : 7794079640
NTK-317618

OWN BUSINESS OFFER

★18-28 సం॥ల యువతీ యువకులకు Rs. 49,000/- ల స్వల్ప పెట్టుబడిలోనే లోకల్ ఫ్రాంచైజీతో పర్మినెంట్ బిజినెస్ ఆదాయం. మల్టీసర్వీసెస్+ట్రైనింగ్+డైలీ సపోర్ట్ @ 15 సం॥ల నమ్మకమైన సర్టిఫైడ్ సంస్థ W.W.I-Hyd. Ph: 9908743603.
NT-2580-All

CHANGE OF NAME

★I, PADALA RAMADEVI, R/o. H.No. 1-2-477, Prakasham Road, Korutla, Jagityal District, TS. I have Changed after Marriage My Name as VESHALA LATHA, W/o. Veshala Murali.
NT-319320

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే సుంకె

బోయినపల్లి, జనవరి 6: కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. శనివారం కోరెంలో రోమాల క్రాంతిని పరామర్శించారు. క్రాంతి అనారోగ్యంతో హైదరాబాద్‌లో శస్త్ర చికిత్స చేసుకుని ఇంటికి రాగా పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు డబ్బు సృజన్ రెడ్డి, కొమ్ముల అనంద్ రెడ్డి, రాజిరెడ్డి, తదితరులుఉన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు తిరుపతికి ఘన నివాళి

చందుర్తి జనవరి 6: చందుర్తి మండలం బండపల్లికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు గడ్డం తిరుపతిరెడ్డి వర్ధంతిని శనివారం నిర్వహించారు. జడ్పీటీసీ నాగం కుమార్, సర్పంచ్ విజయ జార్జ్, ఎంపీటీసీ రణధీర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ మాజీ ఎంపీటీసీ ముస్కు పద్మామల్లారెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

క్రికెట్ కిట్టు అందజేత

ఇల్లంతకుంట, జనవరి, 6 : గాలిపెల్లి గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు కరీంనగర్‌లోని నోవా దవాఖాన మేనేజింగ్ డైరెక్టర్ బద్దం శేఖర్ రెడ్డి శనివారం క్రికెట్ కిట్టు, టీ షర్టులను అందజేశారు. దాదాపు రూ.20వేల విలువైన సామగ్రి అందజేశారు.

ముగ్గురిపై చీటింగ్ కేసు

తెలంగాణ చౌక్, జనవరి 6: గత అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి తరుపున ప్రచారం చేస్తే డబ్బులు ఇస్తానని మోసం చేసిన ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన మిట్టపల్లి శ్రీకాంత్‌కు స్వతంత్ర అభ్యర్థి లగిశెట్టి శ్రీనివాస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తే రూ.లక్ష ఇస్తామని గుంటక మహేశ్, ఎలూరి రవికిరణ్ చెప్పారు. ఎన్నికలు ముగిసినా నగదు ఇవ్వకపోవడంతో శనివారం శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు అభ్యర్థి లగిశెట్టి శ్రీనివాస్, మహేశ్, కిరణ్‌పై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ వెల్లడించారు.

అభ్యసనతోనే అద్భుత శక్తి

వేములవాడ,జనవరి 6: పాఠశాల స్థాయిలో విద్యార్థులు తదేకంగా అభ్యసన చేయడం ద్వారా జ్ఞాపకశక్తి పెంపొందుతుందని అపారమేధావి అవార్డి గుగ్గిళ్ల దివ్యమూర్తి అన్నారు. వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి టెక్నో స్కూల్ లోని విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెంపొందించుకునేందుకు అనుసరించాల్సిన పద్ధతులను శనివారం తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, యూట్యూబర్ రవితేజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అక్షింతలు

ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట/వేములవాడ రూరల్, జనవరి 6: అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం సందర్భంగా శ్రీరామ పూజిత అక్షింతలను ఇంటింటా అందజేశారు. ఎల్లారెడ్డిపేట సత్సంగ సదనం నుంచి భక్తులు అక్షింతలను ఇంటింటికీ వెళ్లి అందించారు. వేములవాడ మండలం అనుపురం, కోనరావుపేటలోని నాగారం, మంగళ్లపల్లి, కొలనూర్‌లో శోభాయాత్ర నిర్వహించారు. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి

- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రపాణి

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి

సిరిసిల్ల టౌన్, జనవరి 6: క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఇటీవల సిరిసిల్లలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారుల కోసం శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 11నుంచి గజ్వేల్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం క్రీడారంగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో సీఎం కప్ నిర్వహించిందన్నారు. జిల్లాలో క్రీడాకారుల సౌకర్యార్థం రూ.5.50కోట్లతో మినీ స్టేడియం ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, జిల్లా క్రీడల, యువజన సంక్షేమశాఖ అధికారి రామదాసు, మాజీ జడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్, బీఆర్ఎస్‌వై నాయకులు సుంకపాక మనోజ్‌కుమార్, ఎండీ మునీర్, కత్తెర వరుణ్, భైరి మధు పాల్గొన్నారు.

శిక్షల పెంపుతోనే మార్పు

- ఎస్పీ అఖిల్ మహాజన్
- జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు సన్మానం

పబ్లిక్ ప్రాసిక్యూటర్లను సన్మానిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, జనవరి 6: నేరం చేసిన వారికి శిక్ష తప్పదని, శిక్షల పెంపుతోనే సమాజంలో మార్పు వస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ కేసుల్లో నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. పోలీస్ అధికారులు, నాయ్యాధికారులు సమన్వయం పాటిస్తూ నేరస్తులకు ఖచ్చితంగా శిక్షపడే విధంగా కృషి చేయాలని సూచించారు. సెషన్ కోర్టు పీపీ వేముల లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ గడిచిన ఏడాదిలో 60కిపైగా కేసుల్లో నిందితులుగా ఉన్నవారికి జైలుశిక్ష పడేలా కృషి చేసిన పీపీలు అసిస్టెంట్ స్పెషల్ కోర్టు పీపీ వీ లక్ష్మీప్రసాద్, జిల్లా కోర్టు పీపీ నర్సింగరావు, మొదటి అదనపు జిల్లా కోర్టు పీపీ పవన్‌కుమార్, పోక్సో కోర్టు పీపీ పెంట శ్రీనివాస్, వేములవాడ సెషన్స్ కోర్టు పీపీ గడ్డం లక్ష్మణ్, ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ కోర్టు పీపీ సందీప్‌ను అభినందించారు. ఇక్కడ అదనపు ఎస్పీ చంద్రయ్య, టౌన్ సీఐ ఉపేందర్, మానిటరింగ్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుళ్లు ఉన్నారు.

కల్యాణం.. కమనీయం..

- నేత్రపర్వంగా శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం
- భారీగా తరలివచ్చిన భక్తులు

శ్రీలక్ష్మీనర్సింహ స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న పండితులు

హాజరైన భక్తులు

తంగళ్లపల్లి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నెల 3న ప్రారంభమైన మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ క్రమంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య నేత్రపర్వంగా నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎంపీపీ పడిగెల మానస, జడ్పీటీసీ పుర్మాణి మంజుల, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్ చైర్మన్ శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. - సిరిసిల్ల రూరల్, జనవరి 6

'ఆపరేషన్ స్మైల్'ను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- అధికారులతో సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, జనవరి 6: జిల్లాలో ఆపరేషన్ స్మైల్-10 కార్యక్రమాన్ని ఈ నెలాఖరు వరకు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పీ గౌతమి, అదనపు ఎస్పీ డీ చంద్రయ్యతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా ఆయాశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భిక్షాటన చేస్తున్న పిల్లలు, వీధి బాలలను గుర్తించి, వారిని తల్లిదండ్రుల చెంతకు చేర్చి కౌన్సెలింగ్ ఇప్పించేలా చూడాలన్నారు. పిల్లలను పనిలో పెట్టుకున్న వారిపై కేసు నమోదు చేయాలన్నారు. దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజంకు సూచించారు. దవాఖానలు, బ్యాంకుల్లో వయోవృద్ధుల కోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసేలా చూడాలని ఆదేశించారు. ఐసీడీఎస్ ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న పోషకాహారాన్ని ప్రతిరోజూ తనిఖీ చేయాలని సీడీపీవోలను ఆదేశించారు. మహిళలు పని చేసే ప్రదేశంలో లైంగిక వేధింపుల నివారణ కోసం ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ద్వారా వివరాలు సేకరించాలన్నారు. భేటీ బచావో.. భేటీ పడావో.. ద్వారా మహిళా సాధికారతకు పెద్దపీట వేయాలని సూచించారు. సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అంజయ్య, డీఈవో రమేశ్‌కుమార్, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీఏవో భాస్కర్, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్ రావు, అధికారులు మోహన్‌రెడ్డి, రఫీ, గంగయ్య, భూమిక సేవా సంస్థ ప్రతినిధి సత్యవతి, ఎన్జీవోలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో అన్ని వివరాలుండాలి

- అదనపు కలెక్టర్ గౌతమి

ఎల్లారెడ్డిపేటలో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ తీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఎల్లారెడ్డిపేట, జనవరి 6: ఆన్‌లైన్‌లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా దరఖాస్తు దారుల వివరాలను నమోదు చేయాలని అదనపు కలెక్టర్ గౌతమి అధికారులకు సూచించారు. శనివారం ఎల్లారెడ్డిపేటలో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. ఇక్కడ ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ రామచంద్రం, ఎంపీవో వజీర్ అహ్మద్ తదితరులు ఉన్నారు.